క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల్లో ఆర్డీవో పరిశీలన


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల, చింత కుంట, భూషణరావుపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోరుట్ల ఆర్డీవో వినోద్ కుమార్ సోమవారం పరిశీలించారు. తూకం వేసిన ధాన్యం బస్తాల నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, లారీలు లేకపోవడంతో బస్తాలు తరలించడంలేదని రైతులు ఆర్డీవోకు విన్నవించారు. ఆర్డీవో వినోద్‌కుమార్ లారీల కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఒకొక్క కేంద్రానికి రెండు లారీలు పంపించి ధాన్యం బస్తాలు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ నాగేశ్, రైతులు ఉన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ నిరసన


డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: సూరమ్మ ప్రాజెక్టుతోపాటు కాలువ పనులు త్వరగా ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సాగునీరందించే సూరమ్మ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్ని నిరసనలు తెలిపిన ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ గీతాంజలికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, ఎండీ అజీమ్, అల్లకొండ లింగం గౌడ్, కల్లెడ గంగాధర్, వెలిచాల సత్యనారాయణ, ఎగ్యారపు శ్రీహరి, గాండ్ల మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎంపీపీ ని ఎన్నుకోవాలని జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ ఎంపీటీసీ చెవుల లక్ష్మి, అనంతారం ఎంపీటీసీ ఊరడి జమున సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా ఇన్‌చార్జి ఎంపీపీ పదవిలో కొనసాగుతున్నారని, బీసీ జనరల్‌కు వచ్చిన పదవిని ఓసీలు అనుభవిస్తున్నారని, దీంతో బీసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. వెంటనే ఎంపీపీని ఎన్నుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం పారిశుధ్య పనులను డీఎల్‌పీవో శ్రీనివాస్ పరిశీలించారు. మురికికాలువలను , చెత్తా చెదారం తొలగించే పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. తడి, పొడి చెత్తను వేరుగా చేసి గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. వర్మి కంపోస్టు తయారీతో గ్రామపంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు గుంతలను తవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి మనోజ్, కారోబార్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలి

ఇబ్రహీంపట్నం: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ తెలిపారు. ప్రజావాణికి కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరు అవుతున్నారని మిగతా శాఖల అధికారులు హాజరు కావడం లేదని, ప్రజావాణికి రాని అధికారులపై ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

గాలి వీచిందా.. కరెంట్ గోవిందా!

- అటవీప్రాంతం నుంచి విద్యుత్ లైన్లు
- తరచూ అంతరాయంతో వినియోగదారులకు తిప్పలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు


సారంగాపూర్ అటవీప్రాంతం గుండా లైన్లు


సారంగాపూర్ సబ్‌స్టేషన్

సారంగాపూర్: ఉమ్మడి సారంగాపూర్ మండలంలో ఎక్కువ గ్రామాలు అటవీప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. మండల పరిధిలోని సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేసే ప్రధాన విద్యుత్ లైన్లు అటవీప్రాంతాల నుంచి ఉండడంతో భారీ ఈదురు గాలులు, వర్షాలకు తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు, సిబ్బంది ఎంతో శ్రమిస్తేగాని విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కష్టమవుతోంది.

18 గ్రామాలు...3 విద్యుత్ సబ్‌స్టేషన్లు...

సారంగాపూర్ మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉన్నాయి. సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి గ్రామాల్లో మూడు 32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. సారంగాపూర్, రేచపల్లి సబ్‌స్టేషన్లకు వచ్చే ప్రధాన విద్యుత్ లైన్లు పూర్తిగా అటవీ ప్రాంతం నుంచి ఉండడంతో చిన్న గాలి వీచినా.. వాన కురిసినా విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది.

మూడు సబ్‌స్టేషన్లకు జగిత్యాల నుంచి సరఫరా...

సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి సబ్‌స్టేషన్లకు జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. జగిత్యాల నుంచి పొలాస మీదుగా తిప్పన్నపేట, హైదర్‌పల్లి, కోనాపూర్, పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి మీదుగా ఆయా సబ్‌స్టేషన్లకు సరఫరా జరుగుతోంది.

లక్ష్మీదేవిపల్లి వద్ద ఎయిర్ బ్రేకర్ స్విచ్ (ఏబీ స్విచ్)

32 కేవీ విద్యుత్ లైన్లు లక్ష్మీదేవిపల్లి వరకు తీసుకువచ్చి అక్కడ ఎయిర్‌బ్రేకర్ స్విచ్ ఏర్పాటు చేసారు. ఇక్కడి నుండి సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఏ ఒక్క సబ్‌స్టేషన్ పరిధిలో ఏదైనా సమస్యగాని, విద్యుత్ అంతరాయం, ఇతర సాంకేతిక సమస్యలు ఏర్పడితే ఆ సబ్‌స్టేషన్‌కు ఇక్కడ విద్యుత్ సరఫరా నిలిపివేసి, మిగిలిన రెండు సబ్‌స్టేషన్లకు సరఫరా కొనసాగించేలా ఏర్పాటు చేశారు.

- సారంగాపూర్, రేచపల్లి సబ్‌స్టేషన్లకు వేర్వేరుగా లైన్లు 32 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు జరిగింది. ఈ రెండు సబ్‌స్టేషన్లకు వెళ్లిన లైన్లు దాదాపు 4 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు పూర్తిగా అటవీప్రాంతంలో ఉన్నాయి.

చెట్లపై పిడుగులు పడి తరచూ విద్యుత్ అంతరాయం

- సారంగాపూర్, రేచపల్లి సబ్‌స్టేషన్లకు వచ్చే విద్యుత్ లైన్లు పూర్తిగా అడవుల నుంచి ఉండడంతో భారీ ఈదురు గాలులు, వర్షాలకు చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడి పోళ్లు విరిగిపోవడం, లైన్లు తెగిపోయి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. వీటికితోడు హరిత హారంలో నాటిన మొక్కలు కరెంట్ వైర్ల కింద ఉండడంతో, వాటి కొమ్మలు తీగలకు తాకి తెగిపోతున్నాయి.

పిడుగులతోను భారీగా నష్టం...

- స్తంభాలపై పిడుగులు పడితే వాటిపై ఉన్న ఇన్సులేటర్లు పగిలిపోయి, వాటి స్థానంలో కొత్తవి బిగించడానికి చాలా సమయం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పునరుద్ధరిస్తున్నాం

సారంగాపూర్ మండలానికి వచ్చే 32 కేవీ విద్యుత్ లైన్లు ఎక్కువ అటవీప్రాంతంలో ఉన్నాయి. చెట్లు ఉన్న చోట పిడుగులు పడుతుంటాయి. దీంతో పోళ్లపై పిడుగులు పడి ఇన్సులేటర్లు పగిలిపోవడం, చెట్లు విరిగి లైన్ల మీద పడితే పోళ్లు విరగడం జరుగుతుంది. అర్ధరాత్రి సమయంలో భా రీ వర్షాలోనూ, గాలులు వీస్తున్న సమయంలోనూ విద్యుత్ అంతరాయం జరిగినా అక్కడికి వెళ్లి సమస్యను విద్యుత్ సిబ్బందితో కలిసి సమస్యను పరిష్కరిస్తున్నాం. ప్రజ ల కు ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నాం.

– ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్, సతీశ్, ఏఈ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


మెట్‌పల్లిలో తనిఖీ చేస్తున్న అధికారులు


ఇబ్రహీంపట్నంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎవో,ఎస్సై

మల్యాల: మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఫర్టిలైజర్ దుకాణాల్లోని నిల్వ, రిజిస్టర్‌లో నమోదు చేసిన విత్తనాలు, మందుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై మంద చిరంజీవి, మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్, ఏఈవో కారుణ్యకుమార్ పాల్గొన్నారు.

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఏవో త్రివేదిక, ఎస్సై సుధీర్‌రావు సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. రైతులు కూడా తాము కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించి రశీదులు తీసుకోవడం బాధ్యతగా భావించాలన్నారు.

మల్లాపూర్: అనుమతి లేకుండా పెస్టిసైడ్స్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నవీన్‌కుమార్, ఏవో లావణ్య హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ ఆమోదించిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రసీదు తీసుకొని భద్రపరుచుకోవాలని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. సోమవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణయాజమానులు ప్రతి రోజు స్టాక్ వివరాలు, విత్తన ధరలు, బోర్డుపై నమోదు చేయాలని, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లను రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఉమాసాగర్, ఏఈవో నరేశ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ లక్ష్మీనారాయణ, ఏవో షాహిద్ అలీ అన్నారు. పట్టణంలోని పలు విత్తన విక్రయ దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను నిర్వహించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోరుట్ల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్, విత్తనాల షాపుల్లో ఎస్సై సతీశ్ కుమార్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. ఫిర్యాదులు వస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గొల్లపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏవో కరుణ, ఎస్సై దత్తాద్రి హెచ్చరించారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులు, పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని అన్నారు.

విరాసత్ ఆప్షన్ పునరుద్ధరించాలి


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న టీజేఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: గ్రామపంచాయతీల్లో స్థిరాస్తి విరాసత్ ఆప్షన్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ జనసమితి నాయకులు కోరారు. సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ మహేశ్వర్‌కు టీజేఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. గ్రామాల్లో స్థిరాస్తి భవనాల యాజమానులు మరణించినట్లయితే వారి వారసులకు హక్కు ప్రకారం యాజమాన్య బదిలీ చేయాల్సి ఉండగా గత కొద్ది నెలలుగా విరాసత్ కంప్యూటర్ ఆప్షన్ ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా అధికారులు ఆప్షన్‌ను తొలగించడం సరికాదని అన్నారు. వెంటనే విరాసత్ ఆప్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్, మండల అధ్యక్షుడు కంతి రమేశ్, నాయకులు పాల్గొన్నారు. ప్రజావాణిలో ఎంపీడీవో ప్రభు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, ఏఈవో శ్యామ్, భగీరథ ఏఈ మల్లేశ్, ఏపీఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా రైతుసంఘం బంద్‌కు బీజేపీ మద్దతు


వెల్లటూర్‌లో షాపులు మూసివేస్తున్న నాయకులు

వెల్లటూర్: ధాన్యం కొనుగోలులో మిల్లర్ల అక్రమ దోపిడీ, మిల్లర్ల పట్ల ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా జగిత్యాల రైతు సంఘం ఇచ్చిన జిల్లా బంద్‌కు వెలటూర్ మండల బీజేపీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేసి రైతుల బంద్‌కు సహకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, మండల అధ్యక్షుడు చక్రపాణి, కొత్తపేట సర్పంచ్ కొమ్ము రాంబాబు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు రావు హనుమంతరావు, బుద్దె బాపు, గోపతి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో బంద్ ప్రశాంతం

కొండగట్టు: తరుగు పేరుతో రైస్ మిల్లర్లు, సెంటర్ నిర్వహకులు రైతులను దోచుకుంటున్నారని జిల్లా రైతు సంఘాల ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. కొడిమ్యాల మండలం కేంద్రంలో సోమవారం బంద్ విజయవంతం అయిందని రైతు సంఘాల నాయకులు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో వ్యాపార సంస్థలు మూతబడ్డాయి.

‘మీరు నేను’ తో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ఆలూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రాయికల్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే మీరు – నేను కార్యక్రమం రూపొందించినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని ఆలూరు, రాజనగర్ గ్రామాలను సందర్శించారు. పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలూరులో రూ.26.64 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ పద్మ, మల్లారెడ్డి, గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని రామాజీపేటలో రూ.14 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం


ధాన్యం పరిశీలిస్తున్న మహిపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్: కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం మోతె గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం తీసుకువచ్చిన రైతులు తేమశాతం రాగానే కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురకంటి స్వప్న, ఎంపీటీసీ రొండి రాజశేఖర్,రెడ్డి పాల్గొన్నారు.

‘రైతులను దగా చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి’

మెట్‌పల్లి: రైతులను దగా చేస్తున్న మిల్లర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ తాలు, తప్ప పేరుతో ధాన్యంలో కోత పెట్టడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. మిల్లర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికై నా రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు బత్తుల లక్ష్మణ్, గోరుమంతుల ప్రభాకర్, రాందాస్, లింగన్న తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాంచందర్‌రావు

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిస్తే జైలుకెళ్లడం తప్పదని పట్టణ సీఐ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో ఇటీవల మద్యం తాగి పట్టుబడిన 112 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, దీంతో ప్రమాదాల్లో చాలా మంది కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఎవ్వరు కూడా మద్యం తాగి వాహనాలు నడపొద్దని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మందుబాబులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రూ.1.15 లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాము పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగు ప్రారంభిస్తున్న నాయకులు

ధర్మపురి: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎడ్ల చిట్టిబాబు, బత్తిని అరుణ అన్నారు. మండలంలోని ఆరెపెల్లిలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచ్ కమల, ఎంపీటీసీ కుంబాల రవిత, జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

సిరిపూర్‌లో ముగిసిన కంటివెలుగు శిబిరం

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు కంటివెలుగు వైద్యబృందాన్ని సన్మానించారు. గ్రామంలో కంటివెలుగును విజయవంతం చేసిన వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని, పంచాయతీ కార్యదర్శి రంజిత్, కంటివెలుగు ప్రత్యేక వైద్యుడు డాక్టర్ రాహుల్‌శర్మ, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

పెగడపల్లి: వచ్చే ఎన్నికల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అడ్వైజరీ కమిటీ అధికార ప్రతినిధి ఇరుగురాల ఆనందం అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమ పథకాలు అమలుపై ప్రజలకు వివరించి మంత్రి గెలపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేందర్‌రావు, మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు


మాట్లాడుతున్న ఎంపీటీసీ మహేశ్

రాయికల్: మండలంలోని రామాజీపేటలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ ఎంపీటీసీ ఆకుల మహేశ్ అధికారులపై మండిపడ్డారు. సోమవారం మాట్లాడుతూ ఎంపీటీసీకి సమాచారం ఇవ్వకుండానే అభివృద్ధి కార్యక్రమాలు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శంకర్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు ఆనంద్, నర్సారెడ్డి, భూమేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో క్లోరినేషన్ చేపట్టాలి

రాయికల్: మండలంలోని ఆలూరు, రాజనగర్ గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో మురికికాలువల్లో చెత్తాచెదారం తొలగించి ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


పూజలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల: పట్టణంలోని సాయిరాం నగర్ కాలనీలోని శివపంచాయతన భక్తాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు సోమవారం పుణ్యహవచనం, స్థాపితా దేవతా పూజలు, హోమాలు, శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు భానుమూర్తి, శంకర్ శర్మ, ఫణీంద్ర శర్మ, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సొసైటీ భవన నిర్మాణం నిలిపివేయాలి

మల్లాపూర్: మండల కేంద్రంలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న సహకార సంఘం(ప్యాక్స్)భవనం, గోదాం నిర్మాణాన్ని నిలిపివేయాలని మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణి కలెక్టర్ యాస్మిన్‌భాషకి వినతిపత్రం అందించారు. మల్లాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ప్రహరీకి ఆనుకొని ఉన్న రోడ్డును ఆక్రమించుకుని సహకార సంఘం (ప్యాక్స్) గోదాం నిర్మాణాన్ని చేపడుతున్నా.. సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై సమావేశం

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని సూరంపేట, కొండాపూర్ గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయధికారి పి.జ్యోతి ఆయిల్‌పామ్ సాగు వివరాలు, ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్ సూరంపేట ఉపసర్పంచ్ రమేష్ రైతుబంధు కోఆర్డినేటర్ మల్లారెడ్డి చల్ల శ్రీనివాస్ ఏఈవోలురైతులు పాల్గొన్నారు.

భూమిలోకి రానివ్వడం లేదని దివ్యాంగుడి ఫిర్యాదు

కొండగట్టు: కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన గోనెపల్లి గంగాధర్ అనే దివ్యాంగుడు తన భూమిలోకి పక్క భూమి వారు రానివ్వకుండా హద్దులు ఏర్పాటు చేయనీయకుండా అడ్డుపడుతున్నారని సోమవారం కొడిమ్యాలలో జరిగిన ప్రజావాణిలో తహసీల్దార్ స్వర్ణకు ఫిర్యాదు చేశారు.

శానిటేషన్ పనులు పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్, జోగిన్‌పెల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను సోమవారం ప్రత్యేక అధికారి కే.నర్సింహా చారి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వన నర్సరీ, అవెన్యూప్లాంటేషన్, కంపోస్ట్ షెడ్, కిచెన్ గార్డెన్, పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవోలు కనక దుర్గ, శంకర్, ఎంపీడీవో నీరజ, సర్పంచులు యాదగిరి అమ్మాయి, దుంపాల నర్సు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.